క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

మడకశిరరూరల్: మండల పరిధిలోని టీడీపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం 8 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత, సర్పంచ్ గీత తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు హాజరుకావాలన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులు మోస్తున్న మహిళలు

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లి గ్రామంలో శనివారం ఆంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం జ్యోతులతో మూడు సార్లు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి జ్యోతులను అంజన్నకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

30లోపు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

మడకశిర: ఈనెల 30వ తేదీ లోపు పాలిసెట్–23 పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివ కుమారి ఒక ప్రకటనలో కోరారు. టెన్త్ పాసైన విద్యార్థులు, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. మే 10న పాలిసెట్ పరీక్ష జరుగుతుందన్నారు. పట్టణంలోని సిద్ధార్థ స్కూల్‌లో ఈనెల 18 నుంచి మే 8 వరకూ ఉచితంగా పాలిసెట్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.


విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



ఎంఈఓ సత్యనారాయణకు తమ నియామక పత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

అమరాపురం: డీఎస్సీ 98 ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు శనివారం అమరాపురం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ సత్యనారాయణకు తమ నియామక పత్రాలను అందజేశారు. నరసింహమూర్తి (కౌద్రెవు) హనుమంతరాయప్ప (విరపసముద్రం) కృష్ణ మూర్తి (తమ్మడేపల్లి) ఓబన్న (వీ అగ్రహారం) లను ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమించినట్లు ఎంఈఓ తెలిపారు. వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.
పెనుకొండ: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థి, చేరిన పట్టణానికి చెందిన మారుతీరెడ్డి శనివారం ఎంఈఓ ఆంజనేయులు నాయక్‌కు నియామకపత్రం అందజేసి విధుల్లో చేరారు.

పావగడలో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి మయూర్ జయకుమార్

పావగడ: పావగడ విధానసభ క్షేత్రంలో ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్ విజయ భేరి మోగిస్తారని ఏఐసీసీ కార్యదర్శి మయూర్ జయకుమార్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పావగడలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పూర్తి మెజారిటీ సాధించి అధికారాన్ని చేపడుతుందన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్ర శేఖర్ గౌడ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అసమ్మతి నాయకులందరూ కలసికట్టుగా వెంకటేశ్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈనెల 17న వెంకటేశ్ నామినేషన్ పత్రాన్ని దాఖలు చేస్తారని తెలిపారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివ కుమార్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, శంకరరెడ్డి, ఎగువపల్లి నాని, షా బాబు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శశి హులికుంటె పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

మడకశిర(అగళి): విద్యుత్ సమస్యను పరిష్కరించాలని అగళి మండలంలోని హెచ్‌డీహళ్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం రైతులు ధర్నా నిర్వహించారు. వ్యవసాయానికి 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో తాము సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. విషయం తెలుసుకున్న మడకశిర ఏడీఈ సుబ్రహ్మణ్య ప్రసాద్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. విద్యుత్ సమస్యపై రైతులతో చర్చించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదిస్తాం





మడకశిరరూరల్: దిన్నెమీదపాళ్యంలో బుక్‌లెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, గోరంట్ల: మల్లాపల్లిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

సీఎం జగన్ మేలు మరువలేం



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు శారదమ్మ. మడకశిర మండలం దిన్నెమీదపాళ్యం గ్రామం. ఈమె కుటుంబానికి జగనన్న వసతి దీవెన ద్వారా రూ.30,000, జగనన్న విద్యాదీవెన ద్వారా రూ.1,96,000, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.40,500, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.2,774, సున్నా (వడ్డీ రైతు) రూ.2,835, సున్నా వడ్డీ రూ.2,662 చొప్పున మొత్తం రూ.2,76,418 లబ్ధి చేకూరింది. సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం. ఆయన మేలును ఎప్పటికీ మరిచిపోలేం. మళ్లీ సీఎంగా గెలిపించుకుంటామని శారదమ్మ సంతోషం వ్యక్తం చేసింది.

- ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకుంటాం
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో లబ్ధిదారుల హర్షం

మడకశిరరూరల్: పార్టీలకు అతీతంగా సంక్షేమం పథకాలతో ప్రజలకు మంచి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తామని లబ్ధిదారులు తెలిపారు. గోవిందాపురం సచివాలయ పరిధిలోని దిన్నెమీదపాళ్యం, గొల్లహట్టి గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి గ్రామ స్థాయిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికీ పథకాల చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఆశ్వీదించాలని కోరారు. తొలిసారిగా జగన్ ప్రభుత్వంలో మూడు నుంచి నాలుగు సంక్షేమ పథకాలు లబ్ధి పొందామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు సంక్షేమ పథకాలు ఆదుకున్నాయని తెలిపారు. సీఎం జగనన్న పరిపాలనలో తమకు ఎంతో మేలు జరిగిందని.. రానున్న ఎన్నికల్లో మా దీవెనలను ఉంటాయని మహిళలు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. సక్రమంగా పౌష్టిహారాన్ని అందించాలన్నారు. ప్రతి ఇంటికీ కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి సీఎం అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారని వివరించారు. సంక్షేమ పథకాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చెప్పే మాయమాటలను నమ్మవద్దన్నారు. ప్రజలు చెప్పిన సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీటీసీ తాళికేరమ్మ, మాజీ సర్పంచ్ విశ్వనాథ్, వివిధ కమిటీల నాయకులు జయరాం, రవి, సత్యనారాయణ, తిప్పారెడ్డి, తిప్పేస్వామి, నాగభూషణరెడ్డి, కార్యదర్శి ఈరలింగప్ప పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు..

గోరంట్ల: కులమత రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మల్లాపల్లిలో సర్పంచ్ శివానంద నేతృత్వంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు పచ్చా చొక్కాలకే అందాయన్నారు. పేదలకు పింఛన్లు, రేషన్ కార్డులు కావాలంటే జన్మభూమి కమిటీ సభ్యులకు కప్పం కట్టాల్సి ఉండేదన్నారు. అయితే ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో పారదర్శకంగా పథకాలు అందుతున్నట్లు తెలిపారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులను గుర్తించి, వారి ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ఎన్నికల్లో ప్రజా విశ్వాసం కోల్పోయిన టీడీపీ పచ్చపత్రికల ద్వారా అసత్య కథనాలు రాయిస్తూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నట్లు తెలిపారు. వాటిని ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్ సాహెబ్, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, బూదిలి, వానవోలు సహకార సంఘాల అధ్యక్షుడు రఘురామిరెడ్డి, రాజేంద్ర ప్రసాద్, స్థానిక నాయకులు మల్లికార్జున, ఉసేన్, సత్యమయ్య, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కరావులీశ్వర ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న చింతా రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు

గోరంట్ల: కరావులపల్లి గ్రామంలో దాతలు, గ్రామస్తుల సహకారంలో నూతనంగా నిర్మిస్తున్న కరావులీశ్వర ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యయుడు చింతా రామచంద్రారెడ్డి ఆయన సోదరులు కృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు విక్రమ సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి, సోమశేఖరరెడ్డి తదితరులు రూ.3,00,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులు రేపటి రామచంద్రారెడ్డి, గంపల వెంకటరమణారెడ్డి, గొల్ల శ్రీరాములు, మేకల రంగప్ప, రేపటి కృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి చింతా ప్రసాద్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అశ్వర్థరెడ్డి, పూలరంగప్ప, బద్దిలి లోకేష్ , నారాయణరెడ్డి, రేపటి జయచంద్రారెడ్డి, రవిచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఖాతాల్లోకి హౌసింగ్ బిల్లుల జమ

రొద్దం: ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసినట్లు అధికారులు తెలిపారు. తురకలాపట్నం గ్రామంలో పావగడ–పెనుకొండ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో శనివారం అధికారులు హౌసింగ్ డే నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాపై లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ అనంతచారి, హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్ మాట్లాడుతూ.. పునాదుల వరకూ నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు రెండు రోజుల క్రితం ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పనులు వేగవంతం చేయాలని కోరారు. ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ రంగస్వామినాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పవన్, ఏపీఓ జగదీశ్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పరిగి: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో శనివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక మసీదులో ముతవల్లీలు, ముస్లిం మత పెద్దలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం షాదీ మహల్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే భోజనం వడ్డించారు. పరిగిలోని ప్రసిద్ధ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులతో శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వర ఆలయాన్ని రూ.75 లక్షలతో ఆధునికీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కాణిపాకం ఆలయ ట్రస్టు చైర్మన్ మారుతీస్వామి, కొండూరు నవీన్, గణేష్, సజ్జప్ప, కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత ప్రభాకర్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, కోఆప్షన్ సభ్యుడు సలీం, మైనార్టీ నాయకులు ఇర్షాద్, రఫీక్, ఆల్తాఫ్, షబ్బీర్, బుడేన్, రవూఫ్, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు చంద్రారెడ్డి, రామాంజి, నాయకులు సింగారెడ్డి, సురేష్‌రెడ్డి, శంకర్, సర్పంచ్‌లు మంజునాథరెడ్డి పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్'



హిందూపురం: ఈరంపల్లిలో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న చౌళూరు మధుమతిరెడ్డి



పెనుకొండలో పథకాలను వివరిస్తున్న నాయకులు

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా సాగింది. 17వ వార్డు ఎస్సీ కాలనీలో జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కౌన్సిలర్ సుభద్ర, మాజీ ఎంపీటీసీ నాగేంద్ర తదితరులు ఇంటింటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ గోపి పాల్గొన్నారు.
మడకశిర(అగళి): అగళి మండలంలో శనివారం జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. జేసీఎస్ కన్వీనర్ శివన్న పాల్గొన్నారు.
మడకశిరరూరల్: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు. గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. వారి అనుమతిలో ఇంటికి స్టిక్కర్లను అతికించారు.
లేపాక్షి: కొండూరు గ్రామంలో శనివారం ఉదయం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు సుమలత, నరసింహప్ప, నవీన్, సునిత పాల్గొన్నారు.
గుడిబండ: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ పథకాలపై ప్రజలు వందశాతం సంతృప్తి వ్యక్తం చేశారు.
హిందూపురం: జగనన్నే మా భవిష్యత్తు అనేది ప్రజల్లో నుంచి వచ్చిన నినాదమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా అన్నారు. మున్సిపాల్టీలోని పట్టణంలోని 7, 18, 21, 26, 28, 29 వార్డుల్లో కౌన్సిలర్లతో కలసి జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాసిరాబాను, మారుతిరెడ్డి, మల్లికార్జున, రోషన్, కన్వీనర్లు కవిత, షఫీ, ఇలియాజ్, దాదు, ఇమ్రాన్, లక్ష్మీనారాయణ, అశ్వర్థ పాల్గొన్నారు. రాష్ట్రంలో సంక్షేమపథకాల అమలుతో పేదప్రజల జీవితాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. మండలంలోని కొటిపి పంచాయతీ ఈరంపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి, నారాయణరెడ్డి, ఓబుళరెడ్డి,బాలాజి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.
రొళ్ల: ఎ.రాయాపురం పంచాయతీ పరిధిలోని సోమఘట్ట, బంద్రేపల్లి తదితర గ్రామాల్లో శనివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి స్పందన లభించింది.అనంతరం ఇంటింటికీ వెళ్లి డోర్లకు మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్లను అతికించారు. సర్పంచ్ నరసింహప్ప, పంచాయతీ అధ్యక్షుడు చిరంజీవి, సచివాలయ కన్వీనర్ గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.
పెనుకొండ: బోయగేరిలో శనివారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా గృహ సారథుల కన్వీనర్ రాము, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, నాయకుడు లక్ష్మీనారాయణ తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను సేకరించారు.
పెనుకొండ రూరల్: నాగలూరు, అడదాకులపల్లి, గుట్టూరు, వెంకటగిరి పాళ్యం, గోనిపేట, శెట్టిపల్లి, మునిమడుగు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబు ఎంపీటీసీ నిర్మల, నాయకులు నారాయణ స్వామి, సాయిరాం నాయక్, ఆదినారాయణ, సచివాలయ కన్వీనర్లు బాబు, రామచంద్ర, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

19న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

మడకశిర: మడకశిర ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 19న ఉదయం 10 గంటలకు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని సీడీపీఓ నాగమల్లేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో 7 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా.. ఉండగా రొళ్ల మండలంలోని హనుమంతనపల్లి హెల్పర్ పోస్టుకు 3, మడకశిర మున్సిపాలిటీలోని చౌటిపల్లి హెల్పర్ పోస్టుకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు. మిగిలిన 5 కేంద్రాల అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు రాలేదన్నారు.

సర్వేపై నిర్లక్ష్యం వద్దు



సర్వే పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

సోమందేపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద జరుగుతున్న రీ సర్వే పనులను సబ్ కలెక్టర్ కార్తీక్ శనివారం పరిశీలించారు. భూ వివాదాల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ ప్రయివేటు స్థలాలు గుర్తించి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. సర్వేపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సకాలంలో రీ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఏ చిట్టిబాబు, మండల సర్వేయర్ ముద్దరంగప్ప, వీఆర్‌ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తాం



బార్ అసోసియేషన్ సభ్యులతో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేశ్

పావగడ: స్థానిక జేఎంఎఫ్‌సీ న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేశ్ హామీ ఇచ్చారు. స్థానిక మున్సిఫ్ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. విధానసభ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. జేడీఎస్, బీజేపీ కలసినా నూరు స్థానాలు రావన్నారు. అలాంటప్పుడు జేడీఎస్‌కు ఓటు వెయ్యడం వృథా అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్, వెంకట్రామిరెడ్డి, భగవంతప్ప, రఘు, వెంకటస్వామి, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



గాయపడిన అంజినమ్మ

పెనుకొండ రూరల్: గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొన్న ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని రాంపురం వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. కొత్తచెరువు మండలంలోని పోతుకుంటలో దినకర్మకు పోతుకుంటకి చెందిన డ్రైవర్ మద్దిలేటి, కార్తీక్, రాంపురానికి చెందిన ఓబిలేష్, అంజినమ్మ, రొప్పాలకు చెందిన మూర్తి, మహేష్ వెళ్లారు. కార్యక్రమం అనంతరం రాంపురం వస్తుండగా గ్రామానికి సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే పెనుకొండ వైపు నుంచి వేగంగా వస్తున్న ఓ గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొట్టింది. ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారంతా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన మద్దిలేటి, అంజినమ్మ, మూర్తి, ఓబిలేష్, కార్తీక్‌ను 108లో అనంతపురం తరలించారు.

సంక్షిప్త సమాచారం

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



కూల్ డ్రింక్స్ షాపును తనిఖీ చేస్తున్న జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమా

రొద్దం: మండల కేంద్రంలోని పలు దుకాణాలు, హోటళ్లు, కూల్‌డ్రింక్స్ షాపులు, బేకరీలను శనివారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ తిను బండాల దుకాణంలో కల్తీ నూనె వాడుతున్నట్లు గుర్తించారు. బేకరీలో కొన్ని చెడిపోయిన వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. హోటళ్లు, దుకాణాల్లో నాణ్యత పాటించకుండా ప్రజల ఆర్యోగాలతో చెలగాటం ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మామిడి తోటకు నిప్పు

గోరంట్ల: మండల పరిధిలోని చలమయ్యగారిపల్లికి చెందిన రైతు బాబు రెడ్డి (వెంకటేశ్వరరెడ్డి)కి చెందిన మామిడి తోటకు శనివారం మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దాదాపు 50 మామిడి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. మామిడి తోట పక్కన ఎకరా పొలంలో ఉన్న నీలగిరి తోట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

విధులకు పంచాయతీ కార్యదర్శి డుమ్మా

రొద్దం: కోగిర సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి కేశవరెడ్డి విధులకు హాజరు కాలేదని సర్పంచ్ రమాదేవి చెప్పారు. సచివాలయంలో విధులు నిర్వహిస్తూ గతంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి వద్ద పని చేయడానికి వెళ్లాడని తెలిపారు. ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్‌ను సంప్రదించగా.. ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిందన్నారు. ఎమ్మెల్సీ వద్ద విధులు ముగిసినా విధులకు రావడం లేదన్నారు.

పైప్‌లైన్ మ్యాప్ పరిశీలన

పెనుకొండ: నగర పంచాయితీ పరిధిలో తాగునీటి పైప్‌లైన్‌కు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు తయారు చేసిన మ్యాప్‌ను ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శనివారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో పరిశీలించారు. అమృత్–2 పథకం కింద మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.87 కోట్లు మంజూరు చేసింది. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, వైస్ చైర్మన్లు నందిని, సునీల్, జయశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

సోమందేపల్లి: మండల కేంద్రంలో మట్కా నిర్వహిస్తున్న బీటర్లు కుళ్లాయప్ప, నాగముని, అమానుల్లాను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. కొంత కాలంగా మట్కా నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపి వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.14 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.
రొద్దం: మండల కేంద్రంలో షఫీవుల్లా అనే మట్కా బీటర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి శనివారం తెలిపారు. అతడి నుంచి రూ 12,830 నగదు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

20న ముస్లింలకు సరుకుల పంపిణీ

పావగడ: స్థానిక శ్రీనిధి కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 20న రంజాన్‌ను పురస్కరించుకుని పేద ముస్లింలకు నిత్యావసరాల కిట్లను అందజేయనున్నట్లు స్థానిక హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే హెల్ప్ సొసైటీ సంస్థ దశ మానోత్సవ వేడుకలకు గ్రామీణ యువకులు తరలి రావాలని కోరారు.

ఎస్టీ జాబితాలో చేర్చితే ఆందోళన

సోమందేపల్లి: వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చేర్చితే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు అంజి నాయక్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు ధర్నా నిర్వహించారు. జీఓ 52 రద్దు చేయాలని తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు విక్రాంత్ నాయక్, అభి పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

రొద్దం: ప్రతి మహిళా తమకున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య అన్నారు. మండల పరిధిలోని శేషాపురం గ్రామంలో అనంతశక్తి సొసైటీ న్యాయ సలహాల కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

భూముల్లో జెండాలు పాతిన కార్మిక సంఘం నాయకులు

రొద్దం: శ్యాపురం, కోగిర, కంబాలపల్లి గ్రామాల పరిధిలో టింబక్టువ్–కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ రైతు సాగు భూములను ఆక్రమించుకున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆక్రమణలకు గురైన మూడు గ్రామాల పరిధిలోని భూముల్లో ఎర్ర ఎండాలు పాతినట్లు వివరించారు. 4,500 ఎకరాల భూములను టింబక్టువ్–కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ కొన్నేళ్లుగా అక్రమించిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ

రొళ్ల: మండల పరిధిలోని రంగనపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర తండ్రి పెద్ద ముద్దప్ప (88) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ అనంతరాజు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఉపాధి పనుల పరిశీలన

అమరాపురం: బసవనపల్లి, తమ్మడేపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఎంపీడీఓ మునిస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం రోజుకు రూ. 272 చొప్పున బిల్లు చెల్లిస్తామన్నారు.